క్లుప్తంగా

ఎఫ్ఆర్ఎస్‌లో హాజరువేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 662 మంది డ్రాప్‌బాక్స్‌లో ఉన్నారని, వారిని ఈనెల 20 లోపు క్లియర్ చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధిగా ప్రతీ ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ముఖ గుర్తింపు హాజరువేయాలన్నారు. ఉదయం 9, సాయంత్రం 4 గంటలకు చెక్ ఇన్, చెక్ అవుట్ చేయాలన్నారు. మీ హాజరును ప్రతీరోజు రాష్ట్ర స్థాయిలో అధికారులు గుర్తిస్తున్నారని తెలిపారు. 18న టీఎల్ఎం మేళా ఉందని, అన్ని ప్రాథమిక పాఠశాలలు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్‌కుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఖుత్‌బొద్దీన్ పాల్గొన్నారు.

108లో ప్రసవం



శిశువుతో కుటుంబ సభ్యులు, 108 సిబ్బంది

వాంకిడి: మండలంలోని బంబార గ్రామానికి చెందిన ఎరగంటి లలిత గర్భిణికి పురిటినొప్పులతో బాధపడుతోంది. గురువారం సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను మంచిర్యాల మాతాశిశు ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు అధికమయ్యాయి. మంచిర్యాల సమీపంలో వాహనం ఆపి ప్రసవం చేయగా మగబిడ్డకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ ప్రవీణ్, పైలట్ శ్రీనివాస్ తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని మంచిర్యాల మాతాశిశు ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

పాఠశాలల్లో క్రీడలు



గోయగాంలో ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

కెరమెరి: పంద్రాగస్టు వేడుకలకు పాఠశాలలు ముస్తాబయ్యాయి. మండలంలోని వివిధ పాఠశాలల్లో గురువారం క్రీడలు కొనసాగాయి. విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, స్కిప్పింగ్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర ఆటలు ఆడారు. పాఠశాల్లో రంగురంగుల కాగితాలతో తోరణాలు కట్టారు. జెండాకర్రకు ముదు రంగులు పూశారు. విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేయనున్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంఈవో రమేశ్‌బాబు

పెంచికల్‌పేట్: పాఠశాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంఈవో రమేశ్‌బాబు అన్నారు. చేడ్వాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల భవిష్యత్తు ప్రణాళిక, అభివృద్ధి రిజిస్టర్‌పై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్‌లో పాఠశాల చరిత్ర, సంస్కృతి, విజయాలు, దాతల దాతృత్వం, నిధుల వినియోగం, విద్యార్థుల విజయాలు, టెస్ట్ ఫలితాలు, ఉద్యోగాలు సాధించిన పూర్వవిద్యార్థులు అంశాలను నమోదు చేస్తామన్నారు. పీఎస్ హెచ్‌ఎం అశోక్‌చందర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న కేతావత్ నాగు

కాగజ్‌నగర్‌టౌన్: పంద్రాగస్టు సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభ గల విద్యార్థులకు కెనరా బ్యాంక్ కాగజ్‌నగర్ బ్రాంచి ఆధ్వర్యంలో మేనేజర్ కేతావత్ నాగు గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఏటా ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన 5 నుంచి 10వ తరగతి వరకు మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి ఆర్థికసాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగజ్‌నగర్ జెడ్పీఎస్ఎస్ పెట్రోల్ పంప్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు రూ.24వేలు అందించామన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ముక్తేశ్వర్, హెచ్‌ఎం వెంకటరాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల్లో చిన్నుగూడ



ఈ చిత్రంలో ఉన్న ఇల్లు చిన్నుబాయిది. 25 ఏళ్ల క్రితం నుంచి ఇప్పటివరకు పైన రేకులు, చుట్టూ కట్టెలు, తడకలతో ఉన్న ఇల్లు. వర్షపు నీరు చేరితే ఆ ఇంట్లో ఉన్న నలుగురు జాగరణ చేయాల్సి వస్తోంది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని చిన్నుబాయి అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది.



చిన్నుగూడ గ్రామం

- కానరాని మౌలిక వసతులు
- అసౌకర్యాల మధ్య గిరిజనులు
- రోడ్లు, పాఠశాలలు లేవు
- ఏళ్లుగా తప్పని తిప్పలు



బురదమయంగా మారిన రోడ్డు

కెరమెరి: స్వాతంత్ర్యం వచ్చాక ఇన్నేళ్లు గడిచిన నేటికి గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో చిన్నుగూడ గ్రామం ఏళ్లుగా సమస్యల్లో ఉంది. గ్రామంలో 19 కుటుంబాలు ఉండగా, సుమారు 156 మంది జనాభా ఉన్నారు. ఆ గ్రామంలో మౌలికవసతులు కానరావడం లేదు. పాఠశాలలు, ఆలయాలు, రోడ్ల సౌకర్యం, తాగడానికి నీరు లేక గిరిజనులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రికి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. నేటికి వారి జీవితాలు దుర్భరంగా మారాయి. ఆదివాసీ దినోత్సవాలు ఎన్ని జరుపుకుంటున్నా మా బతుకుల్లో వెలుగులు రావడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క ఇల్లు మంజూరు కాలేదు

ఇటీవల మండలంలో 300 పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఆ గ్రామంలో ఒక్కటి కూడా మంజూరు కాలేదు. చిన్నుగూడలో మాత్రం రేకులు, పెంకుటిళ్లు ఉన్నాయి. అన్ని తడకలు, మట్టి గోడలతోనే ఉన్నాయి. అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. నేటికి వర్షపు నీరు వస్తే ఇళ్లలోకి చేరుతాయి. ఆ గ్రామానికి వెళ్లడానికి రోడ్డు లేదు. కచ్చా రోడ్డే వారికి దిక్కవుతుంది. వర్షం వస్తే మోకల్లోతు బురదలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేక మురుగునీరు ఇంటి ఆవరణలో నిలిచి ఉండి దుర్గంధం వస్తోంది. పొలాలు ఉన్నప్పటికి చేతిలో చిల్లీగవ్వ లేక సాగు భూములను కౌలుకు ఇచ్చుకున్నారు.

ఉపాధి 'హామీ'మాత్రమే..

ఆ గ్రామంలో ఉన్న కుటుంబాల్లో అందరికి ఉపాధి హామీ కార్డులు ఉన్నాయి. వేసవిలో అక్కడి వారందరూ కూలీ పనికి వెళ్లారు. వారు పనిచేసినంత వేతనాలు వారి చేతికి అందలేదు. దళారులు సగం పంచకున్నట్లు అక్కడి ఆదివాసీలు పేర్కొంటున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నాం. మండల కేంద్రానికి 3 కి.మీ దూరం ఉంది. మా చిన్నుగూడ గ్రామంపై అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. నేటికి కచ్చా రోడ్డుపై నడుస్తున్నాం. గుంతలు పడి, బురదలో ప్రయాణం చేయడం కష్టమవుతుంది. బీటీ రోడ్డు నిర్మించాలి.

– సిడాం మారుతి

ఇల్లు మంజూరు చేయాలి



మేము ఉండేది తడకల ఇల్లు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. గ్రామంలో అందరికీ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మడావి లక్ష్మిబాయి

సమస్యలు పరిష్కరిస్తాం



చిన్నుగూడలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం. రెండోవిడతలో ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చూస్తాం. గ్రామ పంచాయతీలో ఐదు గ్రామాలు ఉండడం వల్ల పంపిణీ చేయలేకపోయాం. ఉపాధి అధికారులతో మాట్లాడుతాం.

– అంజద్‌పాషా, ఎంపీడీవో

అధ్వానంగా బస్టాండ్లు

- ఎక్కడ చూసినా చెత్తా చెదారం
- ముక్కుమూసుకుంటున్న ప్రయాణికులు
- సౌకర్యాలు లేక ఇక్కట్లు



అపరిశుభ్రంగా తలోడి మినీ బస్టాండ్

కౌటాల: ప్రైవేటు వద్దు..ఆర్టీసీ ప్రయాణమే ముద్దు..అన్న నినాదంతో అధికారులు జోరుగా ప్రచారం కల్పిస్తున్నా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. మండలంలోని తలోడి, ముత్తంపేట, గుండాయిపేట, తదితర గ్రామాల్లో మినీ బస్టాండ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడ చూసిన చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. తీవ్ర దుర్వాసన వస్తుండడంతో ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. కొన్ని ప్రయాణ ప్రాంగణాలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు చెట్ల కింద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రధాన ప్రాంగణంలోని మరుగుదొడ్లు వినియోగంలో లేక ఆరు బయటే మూత్ర విసర్జన చేస్తున్నారు. బస్టాండ్‌లో తాగునీటి వసతి లేక తిప్పలు పడుతున్నారు.

నిర్వహణేది?

మండల కేంద్రంలోని ప్రధాన ప్రయాణ ప్రాంగణంతోపాటు గ్రామాల్లో నిర్మాణాన్ని చేపట్టిన నిర్వహణ కరువైంది. ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న ఎలాంటి ప్రయోజనం లేకుండా అస్తవ్యస్తంగా తయారైంది. ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోకపోవడంతోపాటు అవి అపరిశుభ్రంగా ఉన్నాయి. తలోడి, గుండాయిపేట్, ముత్తంపేట గ్రామాల్లో మినీ ప్రయాణ ప్రాంగణాలు బీటలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రయాణికులు చెట్ల కింద సేదతీరుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణ ప్రాంగణాలకు నిర్వహణ కల్పించి ఉపయోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి

గ్రామాల్లో ప్రయాణ ప్రాంగణాలు చెత్తాచెదారంతో నిండి ఉంది. బస్సుల కోసం ప్రయాణికులు చెట్ల కింద ఉంటున్నారు. అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు. మినీ బస్టాండ్ నిర్వహణను పట్టించుకుని వినియోగంలోకి తేవాలి.

– జనార్దన్, గుండాయిపేట

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని విలేజ్ నెం–12లో స్వామి వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు గురువారం రాత్రి వరకు కొనసాగాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆటలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఫుట్‌బాల్ ఫైనల్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఫుట్‌బాల్ ఫైనల్ పోటీల్లో విలేజ నెం 12 సీ టీం ప్రథమ బహుమతి సాధించగా, రెండో బహుమతిని విలేజ్ నెం 12 బి సాధించింది. వీరికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అమిత్ బిశ్వాస్, బికాస్ ఘరామి, రణ్వీర్ బిశ్వాస్, అశుతోష్ మండల్, సమీర్ గుప్తా, దీపక్ గైన్, కమల్ సర్కార్, జ్యోతిర్మయి మండల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులను అరెస్ట్ చేస్తే ఊరుకోం

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కౌటాల: రైతులను అక్రమంగా అరెస్ట్ చేస్తే ఊరుకోమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. పాదయాత్రన హైదరాబాద్‌కు వెళ్తున్న దిందా పోడు రైతులను అక్రమంగా అరెస్ట్ చేసి గ్రామానికి తరలిస్తుండగా కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి పోలీసుల వాహనాలను అడ్డుకున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కౌటాల స్టేషన్‌కు తరలించారు. వెంటనే ఆయన్ను విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు గురువారం స్థానిక కుమురం భీం చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. 5 గంటల అనంతరం ఆర్ఎస్పీని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ రైతులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు పోడు భూముల సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. గచ్చిబౌలి వంద ఎకరాల భూమి విషయమై రేవంత్‌రెడ్డిపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని నిలదీశారు. పోడు రైతుల సమస్యలు పరిష్కరించకుంటే అందరితో కలిసి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. మహిళా నాయకురాలు దాసరి ఉష, నియోజకవర్గ అధ్యక్షులు లెండుగురే శ్యాంరావ్, మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, మండల కన్వీనర్ బండు, కోకన్వీనర్ ఆదే నాందేవ్, నాయకులు అర్షద్ హుస్సేన్, సోమయ్య, వెంకటేశ్, నవీన్, ఆనంద్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్నికలు



ఎన్నికలు నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: కళాశాల నిర్వహణ కోసం ఎన్నికలు నిర్వహించి గెలుపొందిన వారిని లీడర్ వ్యవహరిస్తారని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద తెలిపారు. కళాశాలలో గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. అధ్యాపకులు సుజాత, సంధ్యారాణి, చైతన్య కుమారి, హారిక, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ



జాతీయ జెండాలతో ర్యాలీ తీస్తున్న నాయకులు

కౌటాల: హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, ఉపాధ్యక్షుడు బుర్ల రవి, నాయకులు భూమయ్య, మధుకర్, సత్తయ్య, మిథున్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పరిశీలిస్తున్న ఏఈవో ఆనందరావు

దహెగాం: మండలంలోని హత్తిని, కల్వడ, కొంచవెల్లి, చంద్రవెల్లి గ్రామాల్లో ఎర్రవాగు ముంపుతో నష్టపోయిన పత్తి, వరి పంటలను ఏఈవో ఆనందరావు గురువారం పరిశీలించారు. నీట మునిగి వందల ఎకరాల్లో నష్టం జరిగిందని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



మాలన్‌గొంది వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల రక్షణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలన్నారు. ప్రాణ, ఆస్తి, పశునష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సహాయ చర్యల నిమిత్తం ప్రతీ జిల్లాకు రూ.కోటి విడుదల చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు పేర్కొన్నారు. సెలవులో ఉన్న అధికారులను వెనక్కి పిలిపించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి జిల్లాలోని రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, దహెగాం మండలాల్లో కురిసిన వర్షం కారణంగా వాగులు, ఒర్రెలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని తెలిపారు. 13 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించామన్నారు. 13 లోలెవల్ కాజ్‌వేల వద్ద ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పంచాయతీరాజ్ రహదారులపై 3 చోట్ల కల్వర్టులు కొంతమేర దెబ్బతిన్నాయన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, ట్రాన్స్‌కో ఎస్ఈ శేషారావు, ఇరిగేషన్ ఈఈ గుణవంత్‌రావు పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బందులు రానీయొద్దు

ఆసిఫాబాద్‌రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు రానీయొద్దని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని మాలన్‌గొంది గ్రామానికి వెళ్లే రహదారిపై ఉన్న అప్రోచ్ రోడ్డు కొంత మేర తెగిపోవడంతో గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ కృష్ణ, తహసీల్దార్ రియాజ్ అలీ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉత్పన్నమైతే తక్షణమే రెస్క్యూ టీంని సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. మరో రెండు రోజులు భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. విద్యుత్ తీగలు, బోర్డులు, స్తంభాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో 96664 68821, 97057 80116 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆడే ప్రకాశ్, తదితరులు

కెరమెరి(ఆసిఫాబాద్): పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆడే ప్రకాశ్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా పోస్టర్లను మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చినప్పటికి నేటికి ఆ ఊసేలేదన్నారు. 317 జీవోతో వచ్చిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించాలని, రెండేళ్ల బకాయిలను జీపీఎఫ్‌లో జమచేయాలన్నారు. ఎస్ఎస్ఏ, ఐటీడీఏలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి టైంస్కేల్ అమలుతోపాటు, మహిళా ఉపాధ్యాయులకు 27 చైల్డ్ కేర్, మెటర్నిటీ లీవ్ మంజూరు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకుడు అజయ్‌కుమార్, మండల బాధ్యులు జాదవ రవీందర్, శివప్రసాద్, సోము, ప్రత్యూష, మౌనిక తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కోటప్రసాద్

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఎంపీడీవో కోటప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని ఎన్జీవోస్ కాలనీలో రోడ్డు స్థలాన్ని అక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి హద్దు ఎంత వరకు ఉందో అంతలోనే నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వ స్థలాన్ని అక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శి సునీల్ తదితరులు ఉన్నారు.

బురదలో దిగబడిన ట్రాక్టర్లు

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని చారిగాం సమీపంలో ఇటుక లోడ్‌తో వెళ్తున్న రెండు ట్రాక్టర్లు బురదలో దిగబడ్డాయి. గురువారం కాగజ్‌నగర్ నుంచి రెండు ట్రాక్టర్లు ఇటుక లోడ్‌తో వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డుకు అడ్డంగా రెండు ట్రాక్టర్లు ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం కలిగింది.



రేపు వాలీబాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఎస్టీ పీఎంహెచ్ బాలుర వసతి గృహంలో ఈనెల 16న అండర్–15 బాలుర, బాలికల వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్, డీఈవో దీపక్‌తివారీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు హాజరుకావాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబర్చినవారికి ఎస్జీఎఫ్ ఆధ్వర్యాన ఈనెల 18,19న రంగారెడ్డిలోని సరూర్‌నగర్ స్టేడియంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 82470 96710 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పొడిగింపు హర్షణీయం

బెజ్జూర్: పీఏసీఎస్ చైర్మన్, పాలకవర్గాల పదవీకాలం ప్రభుత్వం 6 నెలలు పొడిగించడంపై పీఏసీఎస్ అధ్యక్షుడు ఓంప్రకాశ్ హర్షం వ్యక్తం చేశారు. పీఏసీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి నాగేశ్వర్‌రావుకు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయనున్నట్లు పేర్కొన్నారు.